సాక్షి ఒడిశా

సోమవారం । 5 । ఆగస్టు । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5,15,645

బంగారం: 4 గ్రాముల 750 మిల్లీ గ్రాములు

వెండి: 37 గ్రాముల 950 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరి



కళాకారులకు సత్కారం

కళాకారులకు ప్రోత్సహించేందుకు మజ్జిగౌరి ఎంటర్‌టైన్‌మెంట్ ట్రస్ట్ ముందుకొచ్చింది. ఆదివారం 'రాయగడ టాలెంట్ అవార్డు'లతో సత్కరించింది.

- 8లో



పనులు వేగవంతం చేయాలి

తాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి అధికారులను ఆదేశించారు. రవులి ఘాటి, డొంగాశిలి ప్రాంతాల్లో ఆమె పర్యటించారు.

- 8లో

న్యూస్‌రీల్

ఆదివాసీ మహాసంఘం ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 9న జరగనున్న ఆదివాసీ మహాసంఘం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మజ్జిగౌరి అమ్మవారి మందిరం వద్ద ప్రచార రథం ప్రారంభించారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో రథం పర్యటిస్తుందని ఆదివాసీ నాయకులు ప్రకటించారు. సభకు ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంజులా మినియాక, మిన్నారావు హిమిరిక తదితరులు పాల్గొన్నారు.

దివ్య పథం వితరణ



దివ్యపథం అందజేసిన పారశెల్లి రామరాజు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి ఛత్రపురంలో సత్యసాయి సేవా సమితికి దివ్యపథం (వెల్వెట్ క్లాత్)ను శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆదివారం అందజేశారు. గుసాని సమితి అధ్యక్షుడు నాగులపల్లి వీర్రాజు, పెద్ద కొత్తూరు పంచాయతీ సర్పంచ్ ఎస్.ఝాన్సీ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాతపట్నం సత్యసాయి సేవాసమితి కన్వీనర్ నాగులపల్లి శ్రీనివాసరావు, పి.చిన్నారావు, సేవాదళ్ సభ్యులు ఎం.రామారావు, ఛత్రపురం సమితి కన్వీనర్ నాగులపల్లి దుర్గాప్రసాదరావు, జె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

35 కిలోల గంజాయి స్వాధీనం



రైల్వే పోలీసులకు పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ముగ్గురు యువతులతో పాటు ఓ యువకుడు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం కొరాపుట్ నుంచి రాయగడకు ఓం ప్రకాష్ నాయక్, నమిత కౌలట, హిమాని జాదవ్, రుచి సాని రైల్వే స్టేషన్‌కు చేరుకుని భిలాయి వెళ్లేందుకు సమత ఎక్స్‌ప్రెస్ కోసం ప్లాట్‌ఫారంపై వేచి ఉన్నారు. అదే సమయంలో రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరి బ్యాగులను పరిశీలించారు. అందులో 35 కిలోల గంజాయి పట్టుబడటంతో కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్‌గా ప్రశాంతకుమార్



ప్రశాంత పరిడను సత్కరిస్తున్న సిబ్బంది

జయపురం: పూల్‌బెడలోని ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కేంద్రం డైరెక్టర్‌గా డాక్టర్ ప్రశాంతకుమార్ పరిడ ఆదివారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2001లో రీసెర్చ్ ఫౌండేషన్‌లో చేరారు. వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. కొరాపుట్ జిల్లా జయపురం సబ్ డివిజన్‌లో రైతులకు వ్యవసాయంలో పలు సూచనలిస్తూ అండగా నిలిచారు. ముఖ్యంగా దేశీ విత్తనాల పరిరక్షణలో పద్మశ్రీ కమల పూజారిలాంటి రైతులను ప్రోత్సహిస్తూ వారికి మార్గదర్శకులయ్యారు. 2013 సెప్టెంబర్ 1న జయపురంలోని రీసెర్చ్ ఫౌండేషన్ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సిబ్బంది అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ, సామాన్య రైతుల సంక్షేమం, ఆర్థిక ప్రగతిని దృష్టిలో పెట్టుకొని సేవలందిస్తానని చెప్పారు.

- అధిక ధరలకు ప్రసాదాల విక్రయం
- అమలు కాని సుప్రీం కోర్టు ఆదేశాలు
- తక్షణం చర్యలు చేపట్టాలని శ్రీమందిరం పాలక మండలిని కోరిన సువార్ మహాసువార్ నియోగులు



పూరీ జగన్నాథ ఆలయం

ఆనంద్‌బజార్‌లో అక్రమాలు!

భువనేశ్వర్: జగములనేలే పూరీ జగన్నాథుడి శ్రీమందిరం సముదాయంలో ఆనంద్ బజార్‌కు చాలా ప్రాముఖ్యత ఉంది. స్వామివారి మహాప్రసాదం విక్రయ కేంద్రంగా విశేష ఖ్యాతి కలిగి ఉంది. అయితే అనధికార వ్యక్తుల చొరబాటుతో ఆనంద్ బజార్‌లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో స్వామి మహా ప్రసాదం ఒబొడా ధరలు అదుపు తప్పుతున్నాయని, నిలువునా దోపిడీకి గురవుతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సువార్ మహాసువార్ అధీకృత వర్గాలు రూ.1,000గా నిర్ధారించిన మహాప్రసాదాన్ని దళారీలు 1500 రూపాయలకు అమ్ముతున్నారని చెబుతున్నారు. మరోవైపు ఆనంద్ బజార్‌లో పరిశుభ్రత కూడా అధ్వానంగా తయారైంది.

కోర్టు ఆదేశాలు బేఖాతర్..

సుప్రీం కోర్టు ఆదేశాలు అమలు చేయడంలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఆనంద్ బజార్‌లో అక్రమాలు తారస్థాయికి చేరాయని సువార్ మహాసువార్ వర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై చర్యలు చేపట్టాలని శ్రీ మందిరం పాలక మండలితో సువార్ మహాసువార్ నియోగుల సంఘం ప్రముఖులు చర్చించారు. ఈ సందర్భంగా మహాప్రసాదం ధరల జాబితాను ఖరారు చేయడంపైనా చర్చ జరిగింది. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు తర్వాత మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

అమలు కాని నిర్ణయాలు..

ఆనంద్ బజార్‌లో అక్రమాలు, భక్తుల పట్ల అసభ్య ప్రవర్తన, ఆనంద్ బజార్‌కు సంబంధించిన సుమారు 20 సమస్యలపై గతంలోనూ చర్చించారు. కమిటీలో శ్రీ మందిరం అధికార వర్గాలు, పాలక మండలి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులు, సబ్ కలెక్టర్, శ్రీ మందిరం కమాండెంట్, సువార్ మహాసువార్ నియోగుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి ప్రముఖులతో సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. సత్వ లిపి ఆధారంగా హక్కు ఉన్న సూపర్‌కారులకు మాత్రమే మహాప్రసాదాన్ని విక్రయించాలని సమావేశంలో నిర్ణయించారు. అనధికారిక వ్యక్తులను ఆనంద్ బజార్ నుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. పోలీసు సహాయ కేంద్రం ఏర్పాటు, దుకాణాలకు నంబర్లు, సూచికలు ఏర్పాటు చేయాలని, ఆనంద్ బజార్ నిర్వహణకు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి ధరల



ఒబొడో మహా ప్రసాదం

జాబితా ప్రదర్శించాలని నిర్ణయించారు. అయితే ఈ నిర్ణయం ఇప్పటి వరకు అమలు కాలేదు.

20 ఏళ్లుగా అక్రమాలు..

ఈ సందర్భంగా శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఎంవో డాక్టరు అరవింద్ పాడితో చర్చించిన అనంతరం సువార్ మహాసువార్ నియోగుల సంఘం కార్యదర్శి నారాయణ్ మహసూర్ మాట్లాడారు. 'ఆనంద్ బజార్‌లో దాదాపు 20 ఏళ్లుగా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అనధికారిక వ్యక్తులను తొలగించడం, బయట తయారీ రబిడీ, లడ్డూలు తదితర విక్రయాలను అరికట్టడం, పోలీసు సహాయక కేంద్రాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నా ఇంత వరకు కార్యాచరణకు నోచుకోలేదని చెప్పారు. ఈ విషయాన్ని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారితో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనల కార్యాచరణకు ఎంపిక చేసిన చేసిన 10 మంది సూపర్‌కారులను నియమించాలని కోరినట్లు తెలిపారు. సత్వ లిపి ఆధారంగా సూపకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రతిపాదించామన్నారు. ఈ మేరకు మరోసారి సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం ఖరారు చేయాలని కోరినట్లు తెలిపారు. నియోగుల సంఘం అధ్యక్షుడు పద్మనాభ మహాసువార్ మాట్లాడుతూ ఆనంద బజార్‌లో దళారీలు బాగా పెరిగారన్నారు. తమ వద్ద మహాప్రసాదాన్ని ఒక ధరకు తీసుకుని భక్తులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని ఆరోపించారు. ఇంతకు ముందు శ్రీ మందిరం పాలక మండలికి రేట్ల జాబితాను ఇచ్చామని, అయితే ఇంతలోనే ధరలు పెరిగాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త ధరల జాబితాను సిద్ధం చేయాలని ప్రతిపాదించామన్నారు. అదనంగా, పేద భక్తులకు ఉచితంగా మహా ప్రసాదం పంపిణీ చేయాలని ప్రతిపాదించామని ఆయన తెలిపారు.

వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తాం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్. పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు తదితరులు

- ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు
- వలస కార్మికుల సంక్షేమానికి రూ.10 వేల కోట్లు
- విలేకరులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్

పర్లాకిమిడి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని బీజేపీ పార్టీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అన్నారు. పర్లాకిమిడిలోని సర్క్యూట్ హౌస్‌కు ఆదివారం విచ్చేసిన ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే చక్రధర్ పాయక్‌లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సామల్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌లో 15 శాతం మల్టీ నేషనల్ కంపెనీలకు ఆహ్వానించామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు పూరీ పుణ్యక్షేత్రంలో నాలుగు ద్వారాలు, రత్న భాండాగారం తెరిపించామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం మండీలకు అందజేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేస్తామన్నారు. పేదలకు, రైతులకు, నిరుద్యోగ యువతకు కేంద్ర బడ్జెట్ అత్యంత ప్రాధాన్యమిచ్చిందని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలోనూ కోల్డ్ స్టోరేజీ, పరిశ్రమలు, ఆగ్రో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామన్నారు. ఊ కర్మనిజుక్తి పథకం కింద లక్ష ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. మహిళలకు పరివార్ యోజన కింద రూ.25లక్షల మేర వడ్డీలేని రుణాలు అందజేస్తామన్నారు. వలసకార్మికుల సంక్షేమానికి రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఒడిశా కోస్టల్ కారిడర్ అభివృద్ధిలో భాగంగా కోస్టల్ రాజపథ్ నిర్మిస్తామని సామల్ వెల్లడించారు. ప్రతి గ్రామంలో పక్కాగా రహదారులు నిర్మిస్తామన్నారు. ఊ ఒడిషాలో భాగంగా బీజేపీ ప్రభుత్వం వందరోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

పర్లాకిమిడి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గజపతి జిల్లా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల అసోసియేషన్ (పిస్తా) అధ్యక్షుడు జగదీష్ కుమార్ పాత్రో, ఉపాధ్యక్షుడు బి.గోవిందరావు కోరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌ను సర్క్యూట్ హౌస్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రాథమిక ఉపాధ్యాయుల కాంట్రాక్ట్ నియామక విధానాన్ని ఎత్తివేయాలని, కేంద్ర ఉపాధ్యాయులతో సమానంగా వేతనం మంజూరు చేయాలని, పాత పింఛన్ విధానం కొనసాగించాలని విన్నవించారు. దీనిపై సామల్ సానుకూలంగా స్పందించారు. మూడు డిమాండ్ల నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సమానమైన పనికి తగు వేతనం మంజూరు చేయడంపై త్వరలో తీపి కబురు చెబుతామని చెప్పారు.



సామల్‌కు వినతిపత్రం అందజేస్తున్న పిస్తా ప్రతినిధులు

ప్రాణాంతక వ్యాధుల పని పడదాం



నినాదాలు చేస్తున్న గురండి స్వస్థ్య అధికారులు

పర్లాకిమిడి: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే డెంగీ, మలేరియా, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రి నుంచి గురండీ గజపతి ప్యాలెస్ వరకు స్వస్థ్య కేంద్రం (సీహెచ్‌సీ) సిబ్బంది, ఎస్‌సీడీఓ (సొసైటీ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్) సంస్థ ప్రతినిధులు కలిసి ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కాలువల్లో చెత్త పారబోయకుండా పురపాలక సంఘం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే వేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణ మల్లిక్, డాక్టర్ అనంగ సుధాంశు భుయ్యాన్, గుసాని పబ్లిక్ హెల్త్ విస్తరణాధికారి మమతా పాఢి, ఎస్‌సీడీఓ సంస్థ కార్యదర్శి సునీల్ పట్నాయక్, ఈశ్వర్ చంద్రబెహరా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తీరం.. భయం భయం



భోగొరాయ్ మండలంలోని సముద్ర తీరం

- కోతకు గురవుతున్న సముద్రం
- భయాందోళనలో 4 పంచాయతీల ప్రజలు

భువనేశ్వర్: సముద్ర తీరం కోతకు గురవుతుండటంతో తీర ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. బాలేశ్వర్ జిల్లా భోగొరాయ్ మండల పరిధిలోని తీర ప్రాంతంలో మడ అడవులు ధ్వంసమయ్యాయి. వేలాది చెట్లు దెబ్బతిన్నాయి. భోగొరాయ్ మండలం పరిధిలో తలోసారి నుంచి కీర్తినియా వరకు 12 కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి నెలకొంది. హల్గీ, గొచ్చిదతెఘొరి, కంధిభొంవురి, నారాయణ్ మహంతి పాడియా పంచాయతీలలో తీరం కోతకు గురై జనావాసాల వైపు సముద్రపు నీరు కొట్టుకొస్తోంది. దీంతో హల్గీ పంచాయతీ బింధపద్మాపూర్, గొచ్చిదతెఘొరి పంచాయతీ కృష్ణానగర్, శ్రద్ధాపూర్ పంచాయతీ ఖొడిబిలా, కన్యానగరి, కంధిభొంవురి పంచాయతీ రాంసింగ్‌పూర్, నారాయణ్ మహంతి పాడియా పంచాయతీకి చెందిన బిర్జాదండి, భిరికిటి గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తలోసారి నుంచి కీర్తినియా వరకు రాతి కట్ట నిర్మించాలని, కొత్త ఆనకట్టను నిర్మించాలని వారంతా డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే గౌతం బుద్ధ దాస్ స్పందిస్తూ సమస్యపై జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్‌తో చర్చించానని, తక్షణమే సహాయక చర్యలు చేపడతారని చెప్పారు.

రాయగడ రచయితకు అంతర్జాతీయ అవార్డు

రాయగడ: రాయగడలో లోకో పైలట్‌గా పనిచేస్తున్న అల్లు సాయిరాంకు అంతర్జాతీయ అవార్డు లభించింది. కెనడా దేశంలో అంతర్జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించగా ఆయన రచించిన తెలుగు గ్రహణం అన్న కవితకు దేవరకొండ శేష శ్రీనివాసరావు శాస్త్రి స్మారక బహుమతి లభించిందని ఆదివారం తెలిపారు. కెనడా తెలుగుతల్లి మాస పత్రికలో కవిత ప్రచురితమైందని చెప్పారు. ఇప్పటివరకు 7 కవితలు, 17 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, విరసం, విశాలాంధ్ర, మన తెలుగు తల్లి. కామ్ వంటి సంస్థల నుంచి అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. పలు లఘు చిత్రాలను నిర్మించానని చెప్పారు. ఈ సందర్భంగా సాయిరాంను పలువురు అభినందించారు.



సాయిరాం

చౌడేశ్వరి దేవికి విశేష పూజలు



జయపురం: పూజలందుకున్న చౌడేశ్వరి దేవి



జయపురం: ప్రత్యేక అలంకరణలో సోమసుందేశ్వరుడు



రాయగడ: పూజలందుకుంటున్న చౌడేశ్వరి

జయపురం: దేవాంగుల ఆరాధ్య దైవం చౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు ఆదివారం జయపురంలో ఘనంగా జరిగాయి. స్థానిక పాణినాళ వీధిలోని చౌడేశ్వరి, సోమసుందేశ్వర మందిరంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం దీపారాధన చేశారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రాయగడ: స్థానిక స్వాగత్‌లైన్ సమీపంలోని రామలింగేశ్వర ఆలయంలో ఆదివారం చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో నిలిపి పూజలు చేశారు. సుమారు 110 దేవాంగ కుటుంబాలు పూజల్లో పాల్గొన్నాయి. అమ్మవారికి అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో దేవాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.ఉమాశంకర్, కార్యదర్శి బి.వెంకటరమణ, కోశాధికారి జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జయపురం: ఆలయంలో భక్తుల రద్దీ



జయపురం: దీపారాధన చేస్తున్న భక్తులు


మలేరియాపై అవగాహన కలిగించే లఘుచిత్ర బ్యానర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం


భక్త ప్రహ్లాద నాటికలో ఓ సన్నివేశం

కళాకారులకు సత్కారం


మోక్ష నృత్య ప్రదర్శన

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రోత్సహించేందుకు మజ్జిగౌరి ఎంటర్‌టైన్‌మెంట్ ట్రస్ట్ ముందుకొచ్చింది. ఆదివారం రాయగడలోని బిజు పట్నాయక్ ఆడిటోరియం ఇందుకు వేదికైంది. టీవీ కళాకారుడు, ప్రముఖ హాస్యనటుడు ప్రభాకర్ మిశ్రా, రచయిత, లఘుచిత్రాల నిర్మాత, దర్శకుడు నరేంద్ర మిశ్రా, పట్టణ ప్రముఖులు, న్యాయవాది బ్రజ సుందర్ నాయక్, కవి ప్రశాంత్ నాయక్ తదితరులు హాజరై వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి 'రాయగడ టాలెంట్ అవార్డు'లతో సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ బచ్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోక్ష ప్రదర్శించిన సంబల్‌పూరి నృత్యం, గంజాం కళాకారుల ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం, స్థానిక కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. – రాయగడ


దివ్యాంగ కళాకారుడిని సత్కరిస్తున్న నిర్వాహకులు


ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

క్లుప్తంగా

అక్కుపల్లి తీరంలో ఆకతాయిల హల్‌చల్


అప్రమత్తం చేస్తున్న ఎస్‌ఐ రామారావు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం కొంత మంది ఆకతాయిలు మద్యం సేవించి హల్‌చల్ చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒడిశా, పర్లాకిమిడి, టెక్కలిపట్నం, కాశీబుగ్గ, పలాసతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు తీరానికి వచ్చారు. పలాస, పర్లాకిమిడికి చెందిన నలుగురు యువకులు పూటుగా మద్యం సేవించి తీరంలో వెకిలి చేష్టలు చేస్తూ సముద్ర స్నానానికి దిగారు. మళ్లీ వెనక్కి రాలేకపోవడంతో మత్స్యకారులు వీరిని రక్షించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ సీహెచ్ రామారావు సిబ్బందితో కలిసి తీరానికి చేరుకొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పాలవలసలో పిచ్చికుక్క స్వైర విహారం


సోంపేట సామాజిక ఆస్పత్రిలో సంగారు దూదమ్మకు చికిత్స చేస్తున్న వైద్యులు

సోంపేట: మండలంలోని పాలవలస గ్రామంలో ఆదివారం ఉదయం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన దున్న సోమితు, సంగారు దూదమ్మ, దుమ్ము ఓంకార్, టి.దనలక్ష్మి, డి.వెంకటరావు తదితరులతో పాటు ఒక ఆవును కరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. సోంపేట సామాజిక ఆస్పత్రి, కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బాధితులు చికిత్స పొందారు.

ఉద్దానంలో సినిమా షూటింగ్


మండపల్లి ప్రాంతంలో హిల్ సినిమా షూటింగ్

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి పురుషోత్తం డైరెక్టర్, హీరోగా ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'హిల్' పేరుతో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ఉద్దానం పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. ఈ చిత్రంలో ఉద్దానం ప్రాంతం కళాకారులు జయమ్మ పంచాయతీ ఫేమ్ బెందాళం రాజేష్ విలన్‌గా, హిమరిక రాకేష్, బల్లెడ శ్రీపతి, దినేష్ మజ్జిలు నటులుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ యాజిక ఎడిటింగ్, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ముకుందలు నిర్వహిస్తున్నారు.

హైస్కూళ్లలో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి


టెక్కలిలో సమావేశాన్ని నిర్వహించిన జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ప్రతినిధులు

టెక్కలి: అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షుడు పుట్టా ఉదయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు ప్రమోద్ కుమార్ పాడి వెల్లడించారు. ఆదివారం టెక్కలిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహించాలని కోరారు. పాఠ్యాంశాల్లో మరింత విస్తృతమైన సమాచారాన్ని రూపొందించాలని పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరంను విస్తరింపజేయాలని వెల్లడించారు. ఈ సందర్భంగా టెక్కలి మండలానికి జ్యోతిష్ట బెహరా, నందిగాం మండలానికి లక్ష్మీపతి తదితరులు ఫోరం బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు గగన కుమారి, వి.త్రివిక్రమ్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, ఫోరం ప్రతినిధులు టి.లోకేశ్వరరావు, కె.లక్ష్మీపతి, టి.అప్పలస్వామి, చల్లా రామారావు, జ్యోతష్టి బెహరా, పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

టెక్కలి రూరల్: మండలంలోని కిట్టాలపాడు గ్రామానికి చెందిన వివాహిత మోద నాగవేణి (44) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నాగవేణికి భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె మనస్తాపానికి గురై శనివారం తన ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె కుమార్తె శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నేతలు

జయపురం: ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఒడిశా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కొరాపుట్ జిల్లా శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఒడిశా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కొరాపుట్ జిల్లా శాఖ అధ్యక్షుడు శశిభూషణదాస్ ఆహ్వానం మేరకు ఆదివారం స్థానిక యాదవ భవనంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 21న రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లోహిత్ అకాడమీ భవనంలో నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఖాళీలు భర్తీ కాకపోవడంతో ప్రస్తుత ఉద్యోగులపై అదనపు భారం పడుతుందన్నారు. ముఖ్యంగా విద్య, అటవీ విభాగాలలో అత్యధికంగా ఖాళీలు ఉన్నాయని చెప్పారు. జూనియర్ ఉద్యోగులకు ప్రారంభ వేతనం రూ.42 వేలు, గ్రేడ్ పే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సంజయకుమార్ పండ, ఒడిశా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకాంత దాస్, జగన్నాథ్ మఝి, కైలాశ సామంతరాయ్, సంజీవి పట్నాయక్, కాళీ ప్రసాద్ మిశ్రా, సంతున్‌కుమార్ జెనా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామాలుగా ప్రకటించాలి


గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

జయపురం: అటవీ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా ప్రకటించాలని చామిలిగుడ గ్రామస్తులు కోరారు. శనివారం బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ చామిలిగుడలో గ్రామసభ నిర్వహించారు. చామిలిగుడ, హాతీపకన గ్రామాల ప్రజలు హాజరై వనవాసులకు అటవీ అధికార చట్టం–2006 ప్రకారం తమ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్‌కుమార్ పారిడ, బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధరాజ్ చౌధురి, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, గుప్తేశ్వర రేంజర్, స్థానిక నాయిక్ సర్పంచ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి


ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కల్యాణి

రాయగడ: తాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి అధికారులను ఆదేశించారు. ఆదివారం కాశీపూర్ సమితిలోని రవులి ఘాటి, డొంగాశిలి ప్రాంతాల్లో పర్యటించారు. కాసీపూర్ ప్రజలకు శుద్ధజలం అందించేందుకు రవులి ఘాటి వద్ద నిర్మిస్తున్న మెగా తాగునీటి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు పూర్తయితే తాగునీటి సమస్య తీరడంతో ప్రజలకు కలుషిత నీటి బెడద తగ్గి రోగాల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. అనంతరం డొంగాశిలి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి ప్రహరీ పనులను వారంలోగా పూర్తిచేయాలన్నారు. డొంగాశిలి సంతలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ ప్రధాన్‌ను ఆదేశించారు.

స్నేహితుల దినోత్సవం వేళ విషాదం


అచేతనంగా పడి ఉన్న నిరంజన్

తగరపువలస : స్నేహితుల దినోత్సవం వేళ విషాదం నెలకొంది. సరదాగా గడిపేందుకు వెళ్లిన స్నేహితుల్లో ఒకరు కాలు జారి గంభీరం రిజర్వాయర్‌లో పడిపోవడంతో మునిగిపోయి మృతిచెందాడు. ఈ దుర్ఘటన ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ వద్ద జరిగింది. గీతం విద్యార్థి డోకి నిరంజన్ కాలు జారి పడిపోవడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా నిరంజన్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులు ఆశిష్, రిహాన్, లలిత్, మోషిత్ సరదాగా గడపడానికి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. రిజర్వాయర్ మధ్యలో గట్టుపై నడుస్తుండగా నిరంజన్‌తో పాటు ఆశిష్, రిహాన్ కాలు జారి పడిపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానికులతోపాటు మిగిలిన స్నేహితులు ఆశిష్, రిహాన్‌ను రక్షించగా నిరంజన్ మునిగిపోవడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆశిష్‌కు గాయాలు కాగా ఆనందపురం పోలీసులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వీరంతా గీతం కళాశాలలో బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం చదువుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పలాస. అతని తండ్రి దుస్తుల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. నిరంజన్ మృతి విషయం తెలుసుకున్న స్నేహితులు గంభీరం రిజర్వాయర్ వద్దకు, ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ టీవీ తిరుపతిరావు మృతుని కుటుంబ సభ్యులకు వివరాలు తెలియచేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా తరలిస్తున్న నలుగురు అరెస్టు


పట్టుబడిన నిందితులతో పోలీసులు

జయపురం: నాటు సారా తరలిస్తున్న నలుగురు యువకులను జయపురం అబ్కారీ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మలసర గ్రామానికి చెందిన అభిఖాడి, గొడాపాదర్ గ్రామానికి చెందిన బినోద్ బెనియ, బలియ పంచాయతీ పల్లిగుడ గ్రామానికి సదా గౌథ, అంత పంచాయతీ సోమదాస్‌పుట్ గ్రామానికి చెందిన మంగళ బురుడి ఉన్నట్లు జయపురం అబ్కారీ విభాగ అధికారి నీలాద్రిబిహారి మిశ్రా తెలిపారు. అబ్కారీ అధికారి మిశ్రా, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణరావుల నేతృత్వంలో జయపురం సమితిలో తనిఖీలు నిర్వహిస్తుండగా ములసార గ్రామ కూడలిలో వీరు సారాతో పట్టుబడ్డారు. సారా అమ్మేందుకు వెళ్తున్నట్లు నిందితులు అంగీకరించారని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఉత్సాహంగా జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు


సాఫ్ట్‌బాల్ ఆడి ఎంపికలను లాంఛనంగా ప్రారంభిస్తున్న కలిదిండి వెంకటరామరాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి జూనియర్స్, సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి రికార్డుస్థాయిలో 160 మందికిపైగా క్రీడాకారులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు హాజరై మాట్లాడారు. ఈనెల 17 నుంచి జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జయకేతనం ఎగురవేసి జిల్లాకు గౌరవాన్ని, కీర్తిప్రతిష్టతలను నిలబెట్టాలని కోరారు. అలాగే జిల్లాలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలను విజయవంతం చేయాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా జట్లకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈనెల 7 నుంచి 16వ తేదీవరకు శిక్షణ శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. కేశవరావుపేట జెడ్పీహెచ్‌స్కూల్‌లో బాలురుకు, ఇప్పిలి జెడ్పీహెచ్‌స్కూల్‌లో బాలికలకు శిక్షణ శిబిరాలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

'బోధన'మున పనులు

- విద్యాబోధనలో నరికొత్త సాంకేతికతను జతచేస్తున్న డీహెచ్ సుబ్రహ్మణ్యం
- జి.సిగడాం ఏపీ మోడల్‌స్కూల్‌లో పీజీటీగా విధుల నిర్వహణ
- ఏఆర్ టెక్నాలజీ సహాయంతో విద్యార్థులకు పాఠాల బోధన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆయన ఇంగ్లిష్ చెబితే కుర్రలకు అతుక్కుపోయి మరీ వింటామని విద్యార్థులు చెబుతుంటారు. ఏఆర్ టెక్నాలజీని వాడుకుంటూ ఆయన చెప్పే పద్ధతికి ఫిదా కాని వారంటూ ఉండరని అంటుంటారు. జి.సిగడాం మోడల్ స్కూల్ కాలేజీలో ఇంగ్లిష్ పీజీటీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న దసిక హోర సుబ్రహ్మణ్యం బోధనలో సరికొత్త ఒరవడికి నాంది పలుకుతున్నారు. జిల్లాలోనే కాదు ఉత్తరాంధ్రలోనే ఏఆర్ టెక్నాలజీ సాయంతో బోధన చేసిన అధ్యాపకునిగా గుర్తింపు అందుకున్నారు. దాన్ని మలేషియా టెక్నాలజీ సాయంతో బోధన ఉపకరణం ఉపయోగిస్తున్నారు.

బోధనకు సాంకేతికతను జతచేసి..

2006లో డీఎస్సీ ద్వారా ఎస్‌జీటీగా ఎంపికైన డీహెచ్ సుబ్రహ్మణ్యం విశాఖపట్నంలో పనిచేశారు. అనంతరం 2012లో స్టేట్ సెలెక్షన్ కమిటీ ద్వారా ఇంగ్లిష్ పీజీటీగా ఓపెన్ కేటగిరిలో ఎంపికయ్యారు. మొదటి పోస్టింగ్ అనకాపల్లిలోని పాటిపల్లి ఏపీమోడల్ స్కూల్‌లో పదేళ్లు పనిచేసి 2022లో శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మోడల్ స్కూల్‌కు బదిలీపై వచ్చారు. బోధనలో ఆది నుంచి సాంకేతికతను జత చేయడం ఆయనకు అలవాటు. కోవిడ్ కాలంలోనూ ఆన్‌లైన్ క్లాసులు చెప్పి భేష్ అనిపించారు. 2022 సెప్టెంబర్‌లో బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ స్థాయి ఐడీఏ వర్క్‌షాప్‌కు ఎంపికై ఫిన్‌లాండ్, గ్రేట్ బ్రిటీష్ ఎడ్యుకేషన్ సదస్సులో పాల్గొనడమే కాక అద్భుతమైన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. అలాగే 2023 జనవరిలో యునిసెఫ్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్(ఐటీఎస్‌ఎస్)వారు సంయుక్తంగా నిర్వహించిన సీటీఎల్‌టీ ఆంగ్లభాష శిక్షణ కార్యక్రమంలో తనదైన రీతిలో ప్రతిభ కనబర్చి పీడీ ప్లాన్స్ నిర్వహించి మాస్టర్ ట్రెనర్‌గా ఎంపికయ్యారు. మూడు నెలలపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ 2023 సెప్టెంబర్ 5వ తేదీన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసి సత్కరించింది చూడా.


నిజమైన పులికాదు. ఏఆర్ టెక్నాలజీ సాయంతో బోధన చేస్తున్న సుబ్రహ్మణ్యం

ప్రోత్సాహం మరువలేనిది



విద్యార్థుల మానసిక సామర్థ్యాల ఆధారంగా తరగతి గది బోధనను సాగిస్తూ అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తే మంచి ఫలితాలు వస్తాయి. జిల్లాతోపాటు ఉత్తరాంధ్రలోనే ఇంత వరకు పరిచయం చేయని విధంగా ఏఆర్ టెక్నాలజీ సాయంతో పాఠాల బోధనను చేపట్టడం జరిగింది. ఇలాంటి సాంకేతికత, సామాజిక, సేవా కార్యక్రమాల నిర్వహణకు డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, ప్రిన్సిపాల్, సహచర సిబ్బంది ప్రోత్సాహం, సహకారం మరువలేనిది. అందరికీ కృతజ్ఞతలు.

– డీహెచ్ సుబ్రహ్మణ్యం, ఇంగ్లిష్ పీజీటీ అధ్యాపకుడు, ఏపీమోడల్‌స్కూల్, జి.సిగడాం

క్లుప్తంగా

ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానం

- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసిన గిరిజన సంఘాలు



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను ఆహ్వానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సాలూరు: పాచిపెంట మండలం గొట్టూరు పంచాయతీ పూతికవలస గ్రామంలో ఈ నెల 8న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను గిరిజన సంఘాల నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం రాజన్నదొరను సాలూరు పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఆహ్వాన పత్రికను అందించి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు చెదల రాజు, మాదల సింహాచలం, ముఖి మల్లేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాని మాస్టారుకు మాతృ వియోగం



మహలక్ష్మి

బొబ్బిలి: అభ్యుదయ విద్యాసంస్థల అధినేత మర్రాపు కూర్మినాయుడు(నాని మాస్టారు) మాతృమూర్తి మహలక్ష్మమ్మ(90) శనివారం రాత్రి పరమపదించారు. ఆమెకు అరుగురు సంతానం కాగా ఐదుగురు ఉన్నారు. వారిలో రామచంద్ర శేఖర రావు, కూర్మినాయుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఆమె కోడలు చింత శారద అభ్యుదయ విద్యాసంస్థల ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. మహలక్ష్మి మృతి సమాచారం అందుకున్న పలువురు ప్రముఖులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు ఆదివారం జరిగాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీ తదితరులు

సాలూరు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న జనార్దన సాయి, ఇసాక్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 19 వరకు శ్రీకాకుళం జిల్లాలో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ, పీఈటీ విద్యాసాగర్, నాయుడు అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్‌జిందల్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, నగర శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 171 మందిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ఇసుక, పశువులు తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ఈ చలానాలను విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ విధానాలు అంతేనా..?

పార్వతీపురంటౌన్: విద్యారంగాన్ని గాడిలో పెడతామని ప్రకటించిన ఎన్డీఏ ప్రభుత్వం మరిన్ని తప్పిదాలను కొనసాగించడాన్ని ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగాన్ని తీవ్రంగా నష్టాల పాలు చేసిన 117 జీవో రద్దు చేస్తామని ప్రకటించి కూడా ఇప్పటివరకు ఆ ప్రయత్నం చేయలేదు, సరి కదా ఇప్పుడు తాజాగా జరగనున్న పని సర్దుబాటు ఆ జీఓ ప్రాప్తికి రాష్ట్రస్థాయిలో కమిషనరేట్ నుంచి జరపాలని నిర్ణయించడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గతంలో జరిగిన సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బంది తలెత్తితే జిల్లా స్థాయి అధికారులు పరిష్కరించేవారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తోందని, ఇది విద్యారంగానికి పాఠశాలల మనుగడకు తీవ్ర హాని కలిగించే నిర్ణయమని ఏపీటీఎఫ్ భావిస్తుందని, తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని అన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉండే విధంగా, అవి సమర్థవంతంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ కోరుతున్నట్లు పేర్కొన్నారు.

చదువుకోవాలనుందా..!

- ఓపెన్ అవకాశాలు అందిపుచ్చుకోండి
- టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ
- ఇంటి దగ్గర నుంచి చదివే అవకాశం
- విడుదలైన నోటిఫికేషన్
- ఆగస్టు 28లోగా దరఖాస్తు చేసుకోవాలి



స్టడీ సెంటర్‌లో చదువుతున్న ఓపెన్ స్కూల్ విద్యార్థులు (ఫైల్)

పార్వతీపురం: ఉన్నత విద్య కోసం ఆశపడినా అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చిన్నప్పుడే చదువుకు దూరమైన అనేక మందికి పదోతరగతి, ఇంటర్మీడియట్ పూర్తిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. నియత పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాలబాలికలు, వయోజనులకు విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రోజు వారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా సార్వత్రిక పాఠశాలద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 12 స్టడీ సెంటర్ల ద్వారా ఏటా వేలాది మంది చదువుకునేందుకు దీని ద్వారా అవకాశం లభిస్తోంది. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్ సెట్ వంటి పరీక్షలతోపాటు ఇంటర్ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకూ అర్హులవుతారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్దిష్ట ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసే వారు మాత్రం టెన్త్ పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక్క సబ్జెక్టు రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి, ఉత్తీర్ణత పొందలేకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

పాఠశాల తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పది, ఇంటర్ పాసయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే, రెగ్యులర్ పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. టెన్త్ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలూ రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు సబ్జెక్టుకు పదో తరగతికైతే రూ.100. ఇంటర్‌కు రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఇవీ సబ్జెక్టులు

పదో తరగతికి గ్రూపు-'ఎ'లో ఇంగ్లీషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం /ఒరియా తీసుకో వచ్చు. గ్రూపు-'బి'లో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి.

☛ ఇంటర్‌కు గ్రూపు-'ఎ'లో ఇంగ్లీషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు.

☛ గ్రూపు-'బి'లో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.



ఓపెన్ స్కూల్ లోగో

ఇవీ అర్హతలు

☛ పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి.

☛ దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటరుకు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా అడ్మిషన్ పొందగోరే వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. మధ్యలో చదువు మానేసి, తిరిగి కొనసాగించే వారికి ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చక్కని అవకాశం లభిస్తోంది. ఉపాధి, ఉన్నత చదువులకు ఉపకరిస్తుంది. ఈ సర్టిఫికెట్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

-జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం

ఆగస్టు 28వరకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. జూలై 31నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 28వ తేదీలోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 29నుంచి సెప్టెంబర్ 4వరకు అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు. ప్రవేశాలు పొందగోరే వారు ఆయా అధ్యయన కేంద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి.

కాంట్రాక్ట్ తరగతులు

ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంట్రాక్ట్ తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 కాంట్రాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్‌ను సరఫరా చేస్తారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి

సంతకవిటి: మండల పరిధిలోని కేఆర్ పురం గ్రామంలో రచ్చబండపై కూర్చున్న కాయల ఎల్లమ్మ (60)పై అదే గ్రామానికి చెందిన తేగల రాము ఇటీవల మద్యం మత్తులో వచ్చి దాడి చేయడంతో గాయాలపాలైన ఆమె శ్రీకాకుళంలోని రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ మేరకు ఆదివారం ఉదయం మృతురాలి తమ్ముడు కె.త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యా నేరం కేసుగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ వెల్లడించారు. రాజాం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాయల ఎల్లమ్మను గాయపరిచినట్లు ఈ నెల ఒకటవ తేదీన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా ఆదివారం హత్యానేరంగా కేసును తిరిగి నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు

విజయనగరం: జిల్లా వేదికగా రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ పాఠశాలలో అండర్-7 విభాగంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీపడ్డారు. రెండు రోజుల పాటు ఆద్యంతం ఉత్కంఠ భరిత వాతావరణంలో సాగిన పోటీల్లో విజయమే లక్ష్యంగా చిన్నారులు ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ విజయమే లక్ష్యంగా పోటీపడ్డారు. పోటీల్లో బాలికల విభాగంలో గుంటూరుకు చెందిన ఎఎస్ఎస్. కావ్య ప్రథమ స్థానం దక్కించుకోగా.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎ.వేదప్షి ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఎ.శశాంక్, పల్నాడు జిల్లాకు చెందిన ఎ.మాగ్నస్‌లు మొదటి, రెండవ స్థానాలు దక్కించుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో మైసూరులో జరగనున్న జాతీయ స్థాయి అండర్-7 బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పార్వతీపురం-మన్యం జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ కృష్ణాజీ, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలకు ఎం.రాజీవ్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా పులువురు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ప్రతినిధులు పర్యవేక్షించారు.

పంచాయతీలకు గ్రేడ్-5 కార్యదర్శులు

- ఇన్‌చార్జ్ కార్యదర్శులకు తగ్గనున్న పనిభారం



పాలకొండ మండలంలోని వాటపాగు పంచాయతీ కార్యాలయం

పాలకొండ రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శుల (పీఎస్) కొరతను అధిగమించేందుకు సంబంధిత అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే డీడీఓ అధికారాలు చేపట్టిన గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ లాగిన్‌లో మ్యాపింగ్ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గల 15 మండలాల పరిధిలో 451 గ్రామ పంచాయతీలకు 1 నుంచి 4 గ్రేడ్‌లకు సంబంధించి 214 మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్న క్లస్టర్ల వారీగా చూస్తే జిల్లా పరిధిలో 236 క్లస్టర్లు ఉన్నాయి. వాటిలో గ్రేడ్-1 లేరు. గ్రేడ్-2 గా నలుగురు, గ్రేడ్-3గా ఇద్దరు, గ్రేడ్-4గా 185 మంది సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రాప్తికి మరో 25 మంది గ్రేడ్-4, 20 మంది గ్రేడ్-5 కార్యదర్శులు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. ఇన్‌చార్జ్‌లతో పాలన కుంటు పడుతుందని భావించిన గత వైఎస్సార్‌సీపీ సర్కార్ గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను కూడా డీడీఓ అధికారాలతో గ్రామ పంచాయతీలకు నియమించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ అమలులో కొంత జాప్యం జరిగింది. అప్పట్లోనే డీడీఓ అధికారాలను తీసుకున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల పొజిషన్ ఐడీలను నేటికీ సంబంధిత ఎంపీడీఓల సీఎఫ్ఎంఎస్ లాగిన్ మ్యాపింగ్ చేయకపోవడంతో జీతాలు, నిధుల వ్యయం, బిల్లుల తయారీకి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల వివరాలను ఎంపీడీఓ లాగిన్‌లో మ్యాపింగ్ చేయనున్నారు. గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 197 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను తాజా నిర్ణయంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులను పూర్తిస్థాయి అధికారాలతో జిల్లా పరిధిలో గ్రామ పంచాయతీలకు పంపనున్నారు.

మ్యాపింగ్ చేస్తున్నాం



జిల్లాలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల పొజిషన్ ఐడీలను ఎంపీడీఓ లాగిన్ మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేశాం. డీడీఓ అధికారాలు ఉన్నప్పటికీ ఎంపీడీఓల లాగిన్ మ్యాపింగ్ కాకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియ పూర్తి అయితే మెజారిటీ గ్రామ పంచాయతీల్లో పాలన సులభతరమవుతుంది. 197 మంది గ్రేడ్-5 కార్యదర్శులను గ్రామ పంచాయతీలకు కేటాయించడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో వేగం పుంజుకుంటుంది. ఈ క్రమంలో వారి సంఖ్య కూడా 197 నుంచి 215కు పెరగాల్సి ఉంది.

– బలివాడ సత్యనారాయణ, డీపీఓ, పార్వతీపురం మన్యం

మళ్లీ సచివాలయం రగడ

- పి.చాకరాపల్లి సచివాలయంలో సామగ్రి కనిపించకపోవడంపై పిర్యాదు



చాకరాపల్లి సచివాలయం

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి సచివాలయం రగడ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో సచివాలయం మాది అంటే మాది అని పదమాయవలస, పి.చాకరాపల్లి పంచాయతీల సర్పంచ్‌లు అస్త్రాలు సంధించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈనెల 1వ తేదీన కంప్యూటర్, ప్రింటర్, సీపీయూ, 6కుర్చీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు పి.చాకరాపల్లి సచివాలయం కార్యదర్శి గంగరాజు బలిజిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గొడవ మళ్లీ మొదలైంది. వివరాల్లోకి వెళ్తే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి పక్కా భవనాల నిర్మాణాలు చేపట్టింది. పదమాయవలస, పి.చాకరాపల్లి గ్రామ పంచాయతీలు పక్క, పక్కనే ఉన్నా మధ్యలో సువర్ణముఖి నది ఉంది. పి.చాకరాపల్లి గ్రామం పెద్దదని అందువల్ల తమ మాగ్రామానికి సచివాలయం భవనాన్ని ఇప్పించాలని సర్పంచ్ మోహనరావు పలు పర్యాయాలు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎట్టకేలకు పీఆర్ అండ్ ఆర్‌డి ఆదేశాలతో సచివాలయ భవన నిర్మాణాలను మార్పుచేయాలని సిఫార్సుతో పి.చాకరాపల్లిలో నూతన భవనం నిర్మాణం చేశారు. దీనికి సంబంధించిన పనులన్నీ సక్రమంగా సాగాయి. ఆగస్టు 9, 2022న నూతన సచివాలయ భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. అప్పటినుంచి సచివాలయానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు సజావుగా సాగుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం మారడంతో సచివాలయం రగడ మళ్లీ తెరపైకి వచ్చింది. అందులో భాగంగా ఈనెల 1వ తేదీన సచివాలయంలో ఉన్న కంప్యూటర్, ప్రింటర్, సీపీయూ, 6కుర్చీలను గుర్తుతెలియని వారు పట్టుకుని వెళ్లిపోయినట్లు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలో దీనిపై చర్చ జరిగింది. అధికారులకు, పోలీస్‌శాఖకు ఇవి ఎక్కడ ఉన్నాయో, ఎవరు పట్టుకువెళ్లారో తెలిసినప్పటికీ అందరూ దోబూచులాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపీడీఓ రమేష్‌నాయుడును వివరణ కోరగా గ్రామ కార్యదర్శితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించామని తెలిపారు.



సచివాలయం మార్పుతో ఇచ్చిన కొత్త ఉత్తర్వులు

బైక్ అదుపు తప్పి సచివాలయ ఉద్యోగి మృతి



కర్రి సాగర్ (ఫైల్)

శృంగవరపుకోట: మండలంలోని ఎస్.కోట మేజర్‌పంచాయతీ సచివాలయం-1లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కర్రి సాగర్ (35) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీకాకుళానికి చెందిన సాగర్ మూడేళ్లుగా ఎస్.కోట సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని శ్రీకాకుళంలో ఉన్న తన తల్లిని చూసేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. లావేరు మండలంలోని సుభద్రాపురం వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సాగర్ మృతిపై స్థానిక గ్రామ సచివాలయం ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గిరిజనాభ్యున్నతికి కృషి చేయాలి

సాలూరు: ఆదివాసీల హక్కులను పరిరక్షిస్తూ, గిరిజనాభ్యున్నతికి అందరం కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సాలూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన చట్టాలను, హక్కులను పరిరక్షించాలని, గిరిజన రిజర్వేషన్లు సక్రమంగా అమలుచేయాలని, జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలని కోరారు. అందరికీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలోనే ట్రైకార్ రుణాల మంజూరు

కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ, గిరిజనులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా త్వరలోనే ట్రైకార్ రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు పోటీపరీక్షలకు శిక్షణ తరగతులు త్వరలో వైటీసీలో ప్రారంభమవుతాయని చెప్పారు. అన్ని గిరిజన గ్రామాలకు ఫీడర్‌అంబులెన్స్‌లు వెళ్లే విధంగా రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యంలో మంత్రి సంధ్యారాణి మహిళలతో కలిసి కాలు కదిపారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా.డీవీజీ శంకరరావు కార్యక్రమంలో మాట్లాడుతూ రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, ప్రయోజనాల కోసం అందరం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు గిరిజనసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 40 నాటుకోళ్ల మృతి



మృతి చెందిన నాటుకోళ్లు

తెర్లాం: మండలంలోని మాధంబట్లవలస గ్రామంలో కుక్కల దాడిలో 40 నాటుకోళ్లు మృతిచెందాయి. దీనికి సంబంధించి కోళ్ల ఫారం యజమాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాళ్ల సూర్యనారాయణ నాటుకోళ్ల ఫారం నడుపుతున్నాడు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో కోళ్లఫారంలో ఎవరూ లేని సమయంలో కుక్కలు చొరబడి 40కోళ్లను చంపేశాయి. చేతికి అందించి వచ్చిన కోళ్లను కుక్కలు దాడి చేసి చంపేయడంతో కోళ్లఫారం యజమాని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. ఇదే కోళ్లఫారంలో కొన్ని రోజుల క్రితం సుమారు 150 నాటుకోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వరుస సంఘటనలతో ఆర్థికంగా నష్టపోయానని యజమాని లబోదిబోమంటున్నాడు.

ఉపాధి నిధులతో పశువుల షెడ్లు



గతంలో గోకులం పేరుతో నిర్మించిన పశువుల షెడ్లు


- గత టీడీపీ పాలనలో గోకులాలు
- అప్పట్లో పార్టీ కార్యకర్తలకే కేటాంచారని విమర్శలు
- మళ్లీ అదే ప్రభుత్వంలో తెరపైకి షెడ్లు

రామభద్రపురం: 2014-19 వరకు వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం గోకులం పేరుతో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టింది. అప్పట్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో ఈ నిర్మాణాలు చేపట్టారు.అయితే టీడీపీ కార్యకర్తలకే వాటిని కేటాయించారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉపాధి హామీ నిధులలతో రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు వంటి శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నిర్మాణాలను పక్కన పెట్టి, మళ్లీ నాటి గోకులం తరహాలోనే 90 శాతం సబ్సిడీతో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించతలపెట్టింది.

జిల్లాకు 700 షెడ్లు కేటాయింపు

జిల్లాకు 700 పశువుల షెడ్లు కేటాయించారు. వాటి నిర్మాణానికి ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరి చేశారు. గ్రామసభ అమోదం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీ ఉంటుంది.పశువుల షెడ్లకు 10 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 30 శాతం ఆయా యజమానుల వాటాగా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుది.షెడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఉపాధి నిధుల నుంచి సబ్సిడీకి సంబధించిన బిల్లులు యజమాని బ్యాంకు ఖాతా ద్వారా చెల్లిస్తారు. గోకులం తరనహాలోనే ప్రస్తుత షెడ్లను కూడా టీడీపీ కార్యకర్తలకు మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉత్తర్వులు వచ్చాయి..



ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులను ఎంపిక చేయాలని ఉత్తర్వులు వచ్చాయి.లబ్ధిదారుల ఎంపికపై దృష్టి సారించాలని పశు వైద్యాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్లను ఆదేశించాం. లబ్ధిదారుల ఎంపిక రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రారంభిచాం. పశువులకు 10 శాతం, గొర్రెలు, మేకలు, షెడ్లకు 30 శాతం రైతు వాటా చెల్లించాలి. గ్రామ సభ తీర్మానం తప్పనిసరిగా ఉండాలి. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

వైవీ రమణ, పశువైద్య శాఖ జేడీ,విజయనగరం

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్

పార్వతీపురం టౌన్: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్ నగరం పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. జనరేట్ యువర్ బిజినెస్, స్టార్ట్ యువర్ బిజినెస్ అనే అంశాలపై శిక్షణ అందజేస్తామన్నారు. 8వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన మహిళలు, పురుష అభ్యర్థులు శిక్షణకు అర్హులని, ఆసక్తి కలిగిన వారు ఫోన్ 9177297528 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.